## క్లుప్తంగా

### అధికారులు ఏకపక్ష నిర్ణయాలు మానుకోవాలి



గ్రామపంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

దొర్నిపాడు: టీడీపీ నాయకుల ఒత్తిడికి తట్టుకోలేక అధికారులు ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవడం సరికాదని వైఎస్సార్‌సీపీ మండల వైస్ ప్రెసిడెంట్ మోహన్‌నాయుడు, సొసైటీ మాజీ చైర్మన్ భూమా చెంచిరెడ్డి అన్నారు. సోమవారం వారు మాట్లాడుతూ గ్రామానికి చెందిన షరీఫ్ టీ కొట్టును తొలగించి జీవనోపాధిని దెబ్బతీశారని, అలాగే అక్రమ కట్టడం అంటూ గుర్రప్ప ఇంటి మెట్లను జేసీబీతో తొలగించారన్నారు. డబ్ల్యూ గోవిందిన్నె రస్తాలో ఉన్న చౌడమ్మ గుడి వద్దనుంచి సచివాలయం వరకు రోడ్లను ఆక్రమించారని వాటిని తొలగించాలని గ్రామ పంచాయతీ కార్యదర్శి లక్ష్మయ్యకు వినతి పత్రం అందజేశారు. వైఎస్సార్‌సీపీ సానుభూతి పరులను లక్ష్యంగా చేసుకొని ఇబ్బంది పెట్టడం సరికాదన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకటసుబ్బ నాయుడు, మైనుద్దీన్, భూమా శ్రీనివాసరెడ్డి, హుసేన్‌బాషా, శ్రీనివాసులు, సుబ్బయ్య, గుర్రప్ప, పుల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### సీజనల్ వ్యాధులపై జాగ్రత్త



ముత్యాలపాడులో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారిణి తస్లీమా సుల్తానా

చాగలమర్రి: వర్షాకాలంలో డెంగీ, మలేరియా తదితర విషజ్వరాలు ప్రబలే అవకాశం ఉందని అప్రమత్తంగా ఉండాలని ముత్యాలపాడు పీహెచ్‌సీ వైద్యాధికారిణి తస్లిమా సుల్తానా ప్రజలకు సూచించారు. సోమవారం ముత్యాలపాడు గ్రామస్తులకు సీజనల్ వ్యాధుల పట్ల తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. ఇంటి పరిసరాల్లో దోమలు వృద్ధి చెందకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి జి.వెంకటేశ్వర్లు, సీహెచ్‌ఓ మనీషా, ఏఎన్‌ఎం శుభాషిణి, ఆశ కార్యకర్తలు రమాదేవి, పీరమ్మ, లక్ష్మీనరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

### శెట్టివీడు గ్రామం సందర్శన

చాగలమర్రి: స్వచ్ఛ భారత్ గ్రామీణ మిషన్ పథకం కింద గతంలో మండలంలోని శెట్టివీడు గ్రామం బహిరంగ మల విసర్జన రహిత గ్రామంగా ఎంపికైంది. సోమవారం ఆళ్లగడ్డ, రుద్రవరం మండలాల ఎంపీడీఓలు రమణారెడ్డి, రామచంద్ర, ఈఓపీఆర్‌డీలు శ్రీనివాసశర్మ, తాహీర్ హుసేన్‌లతో కూడిన ప్రత్యేక అధికారుల బృందం ఆ గ్రామాన్ని సందర్శించారు. స్థానిక ఎంపీపీ పాఠశాల, సబ్ సెంటర్, కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్, సాలీడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ షెడ్లను పరిశీలించారు.

### వ్యక్తిగత మరుగుదొడ్లపై ఆరా

రుద్రవరం: మండల పరిధిలోని టి.లింగందిన్నెలో సోమవారం రుద్రవరం, ఆళ్లగడ్డడ్డ ఎంపీడీఓలు రామచంద్ర, రమణారెడ్డి, ఈఓఆర్డీలు శ్రీనివాసశర్మ, తాహెర్ తదితరులు వ్యక్తిగత మరుగు దొడ్లపై విచారణ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రంతో పాటు గ్రామంలో ఇంటింటికీ వెళ్లి వ్యక్తి గత మరుగు దొడ్లు ఉన్నాయా లేవా అనే అంశంపై ఆరా తీశారు. అలాగే తాగు నీటి సరఫరా ట్యాంకు, చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓడీఎఫ్ విలేజ్ టాయ్‌లెట్స్ కింద మండలంలో టి.లింగందిన్నె, శ్రీరంగాపురం రెండు గ్రామాలు ఎంపిక అయ్యాయని తెలిపారు. ఇందులో ముందుగా టి.లింగదిన్నెలో విచారణ చేపట్టి వివరాలు సేకరించామని తెలిపారు. గ్రామాల్లో అక్కడక్కడ వ్యక్తి గత మరుగు దొడ్లు లేవని, వారికి కొత్త మంజూరు వచ్చినప్పుడు నిర్మించు కోవాలని సూచించినట్లు తెలిపారు.

# పెన్షన్ల పంపిణీలో నిర్లక్ష్యం వీడండి

- 1వ తేదీ ఉదయమే లబ్ధిదారులకు అందజేయాలి
- పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి
- అధికారులతో సమీక్షలో జిల్లా కలెక్టర్ రాజకుమారి





సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రాజకుమారి

నంద్యాల: ఎన్టీఆర్ భరోసా పథకం కింద అందజేసే పెన్షన్లలో క్షేత్రస్థాయి సిబ్బంది నిర్లక్ష్యం వీడాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి హెచ్చరించారు. ఆగస్టు 1వ తేదీ ఉదయం 6 గంటలకే లబ్ధిదారుల చేతికి పెన్షన్ అందాలని ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సెంటనరీ హాల్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా జిల్లా అభివృద్ధిపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జులై 1న సచివాలయ సిబ్బంది ఉదయం 8.30 గంటల తర్వాత హాజరై పెన్షన్ల పంపిణీ చేపట్టడంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. వచ్చేనెల 1వ తేది ఉదయం ఐదు గంటలకే సచివాలయ సిబ్బంది సంబంధిత కార్యాలయాలకు హాజరై ఉదయం 6 గంటలకు పెన్షన్ పంపిణీ చేయాలన్నారు. ఈ దిశగా పర్యవేక్షణ చేపట్టాలని ఎంపీడీఓలకు ఆదేశించారు. తన ఆదేశాలు ఉల్లంఘించిన సచివాలయ సిబ్బందిని సస్పెండ్ చేయాలన్నారు. గ్రామాల్లో, పట్టణాల్లో పారిశుద్ధ్య లోపాలు ఉన్నాయని ఈఓపీఆర్డీలు, పంచాయతీ కార్యదర్శులు, మున్సిపల్ కమిషనర్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. వ్యవసాయ సీజన్ ప్రారంభం కావడంతో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సబ్సిడీపై నాణ్యమైన విత్తనాలు, రసాయనిక ఎరువులు అందజేయాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. పల్లెల్లో తాగునీటికి ఇబ్బంది లేకుండా ఎప్పటికప్పుడు పైపులైన్ల మరమ్మతులు చేయించి స్వచ్ఛమైన తాగునీటిని సరఫరా చేయాలన్నారు. ఉపాధి హామీ పథకం కింద పండ్ల తోటల పెంపకాన్ని ప్రోత్సహించాలన్నారు. జిల్లా ఉద్యాన పంటల సాగుకు అనుకూలంగా ఉందన్నారు. బుగ్గానిపల్లి తండాలో ఆర్ఓఎఫ్ఆర్ కింద 36 ఎకరాల్లో కొంతమందికి భూ పట్టాలు ఇచ్చారని, మిగిలిన పట్టాల పంపిణీలోని సమస్యలను పరిశీలించాలని జాయింట్ కలెక్టర్‌కు సూచించారు. వివిధ చోట వేసిన బోర్లు దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్నాయే తప్ప నీటి సరఫరా కావడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. అధికారులు దీనిపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. జిల్లా అధికారులు సంబంధిత శాఖ ప్రొఫైల్ ఇవ్వడంలో విఫలమవుతున్నారని, జిల్లా అభివృద్ధికి వినూత్న ఆలోచనలతో నివేదికలు తయారు చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

### ఒలింపిక్స్‌లో పతకాలు సాధించాలి



సెల్ఫీ స్టాండ్ వద్ద ఎస్పీ

నంద్యాల(న్యూటౌన్): పారిస్‌లో జరుగుతున్న ఒలింపిక్స్ –2024లో మనదేశం తరపున పాల్గొనే ఏపీ క్రీడాకారులు పతకాలు సాధించాలని కలెక్టర్ రాజకుమారి, ఎస్పీ అదిరాజ్ సింగ్ రాణా ఆకాంక్షించారు. ఒలింపిక్స్ పోటీల్లో పాల్గొంటున్న 117 మంది భారత క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపేందుకు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలో సెల్ఫీ స్టాండ్‌ను ఏర్పాటు చేశారు. ఇందులో కలెక్టర్, ఎస్పీతో పాటు జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్, డీఆర్ఓ పద్మజ, జిల్లా అధికారులు పాల్గొని విజయ సంకేతం చూపుతూ సెల్ఫీ దిగారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ జిల్లా క్రీడాభివృద్ధి అధికారి రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

### సచివాలయ సిబ్బందితోనే పింఛన్ల పంపిణీ

నంద్యాల(న్యూటౌన్): ఎన్‌టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఆగస్టు నెలలో కూడా సచివాలయ సిబ్బంది ద్వారానే చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు సెర్ప్ సీఈఓ నుంచి ఆదేశాలు వెలువడ్డాయి. ఆగస్టు 1వ తేదీ ఉదయం 6గంటల నుంచే పెన్షన్ పంపిణీ ప్రారంభించాలని స్పష్టం చేశారు. తొలిరోజే జిల్లాలో 99 శాతం పెన్షన్ పంపిణీ పూర్తి చేయాలని ఆదేశాలు జారీ అయినట్లు జిల్లా అధికారులు తెలిపారు. ఏదైనా కారణాలతో ఆరోజు ఇవ్వకుంటే మరుసటి రోజు అందించాల్సి ఉంటుందన్నారు. కాగా వలంటీర్లను తొలగించాలనే ఉద్దేశంతోనే వచ్చే నెల కూడా ప్రభుత్వం సచివాలయ ఉద్యోగుల ద్వారానే పెన్షన్ పంపిణీ చేపడుతుందనే చర్చ జిల్లాలో జోరుగా సాగుతోంది.

**ఈ సారి రూ.4వేలే**

రూ.3వేలు ఉన్న పింఛన్ మొత్తాన్ని రూ.4వేలకు పెంచుతున్నట్లు ఎన్నికల ముందు కూటమి సర్కారు ప్రకటించింది. గత మూడు నెలల బకాయిలతో కలిపి జులై నెలలో రూ.7వేలు చొప్పున లబ్ధిదారులకు అందజేసింది. ఆగస్టు 1 నుంచి వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలకు రూ.4వేలు చొప్పునే పింఛన్ ఇస్తారు. నంద్యాల జిల్లాలో 2,19,863మంది లబ్ధిదారులకు రూ.92.85 కోట్లు పంపిణీ చేయనున్నారు.

## ముచ్చుమర్రి ఘటన కారకులను ఎన్‌కౌంటర్ చేయాలి



స్మృతి గీతం పోస్టర్లను విడుదల చేస్తున్న నాయకులు

నంద్యాల(అర్బన్): ముచ్చుమర్రిలో బాలికను అత్యాచారం చేసి హత్య చేసిన నిందితులు, వారికి సహకరించిన వారిని ఎన్‌కౌంటర్ చేయాలని ఎంవీఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పులికొండన్న డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం రూ.25లక్షలు ఎక్స్‌గ్రేసియా, ఐదు ఎకరాల సాగు భూమి, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలన్నారు. స్థానిక కార్యాలయంలో సోమవారం ప్రజా సంఘాల నాయకుల ఆధ్వర్యంలో బాలిక స్మృతి గీతం పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా పులికొండన్న మాట్లాడుతూ బాలిక హత్యకు గురై 22 రోజులు అవుతున్నా కేసును ఛేదించకపోవడం బాధాకరమన్నారు. అవయవాలు దొరకకపోతే కేసు నిలబడే పరిస్థితి ఉండదన్న కారణంతోనే స్థానిక నాయకులు కొందరు ప్రభుత్వ అధికారులతో కుమ్మక్కు రాజకీయాలు చేస్తున్నారన్నారు. బాలిక ఆచూకీ కనుగొనకపోతే రాష్ట్రంలోని అన్ని వర్గాలను కలుపుకొని ఉద్యమం తీవ్రతరం చేస్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లాలు స్వామి, బహుజన యువసేన రాష్ట్ర అధ్యక్షుడు హరి, జయరాం, లాయర్ సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

### ఎరువుల కొరత సృష్టిస్తే చర్యలు



ఎరువుల దిగుమతిని పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి

నంద్యాల (అర్బన్): జిల్లాలో ఎరువుల కొరత లేదని, వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు తప్పవని నంద్యాల జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ హెచ్చరించారు. ఖరీఫ్ కింద 2.36 లక్షల హెక్టార్లలో పంటల సాగు కానుందని, ఇందుకు 1.70 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం కాగా ప్రస్తుతం జిల్లాలో 91వేల 704 మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు. నంద్యాల రైల్వేస్టేషన్‌లోని రేక్ పాయింట్‌కు సోమవారం వచ్చిన 4,229 టన్నుల ఎరువులను రేక్ ఆఫీసర్ ప్రసాదరావుతో కలిసి ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఏఓ మాట్లాడుతూ ప్రైవేటు డీలర్లకు మార్క్‌ఫెడ్‌కు, పీఏసీఎస్‌లకు అవసరాలకు అనుగుణంగా వచ్చిన ఎరువులను కేటాయించామన్నారు. ఎరువులను అధిక ధరలకు విక్రయించే దుకాణాల యజమానులపై చట్టపరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు.

## ప్రధానోపాధ్యాయుడిపై దాడిని ఖండిస్తున్నాం



చాగలమర్రి ఎస్టీయూ కార్యాలయంలో మాట్లాడుతున్న నాయకుడు శివశంకర్



నంద్యాలలో మాట్లాడుతున్న హృదయరాజు

చాగలమర్రి: పాణ్యం మండలం బలపనూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడుగా విధులు నిర్వహిస్తున్న నారాయణపై స్థానిక పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థి తండ్రి గొడ్డలి కామతో భౌతికంగా దాడికి పాల్పడటాన్ని ఎస్టీయూ సంఘం రాష్ట్ర అదనపు కార్యదర్శి శివశంకర్, జిల్లా నాయకులు తీవ్రంగా ఖండిస్తున్నట్లు ప్రకటించారు. సోమవారం వారు విలేకరులతో మాట్లాడుతూ గత శుక్రవారం రోజున విద్యార్థులు పాఠశాల ప్రహరీ గోడను కూలగొట్టడం జరిగిందని, క్రమ శిక్షణ చర్యల్లో భాగంగా ప్రధానోపాధ్యాయుడు నారాయణ ఈ సంఘటనకు బాధ్యులైన విద్యార్థులను పిలిచి మందలించారన్నారు. దీనిని ఓ విద్యార్థి తండి సీరియస్‌గా తీసుకుని ప్రధానోపాధ్యాయుడిపై భౌతిక దాడికి పాల్పడటం తగదన్నారు. ఇలాంటి దాడులు రాష్ట్రంలో ఎక్కడా పునరావృతం కాకుండా కఠిన చర్యలు చేపట్టాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి, పోలీసు శాఖ ఉన్నత అధికారులను కోరుతున్నట్లు తెలిపారు. సమావేశంలో ఎస్టీయు జిల్లా ఉపాధ్యక్షుడు మహబుబ్‌బాషా, మండల శాఖ అధ్యక్షుడు మస్తాన్‌బాషా, ప్రధాన కార్యదర్శి సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

**దాడి హేయమైన చర్య**

నంద్యాల(న్యూటౌన్): ప్రధానోపాధ్యాయుడిపై దాడి అనాగరిక చర్య అని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జి.హృదయరాజు అన్నారు. సోమవారం నంద్యాల పట్టణంలోని స్థానిక ఏపీటీఎఫ్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

- బలపనూరు గ్రామంలో ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నారాయణపై దాడికి పాల్పడిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని ఆప్టా నంద్యాల జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అబ్దుల్ అజీజ్, మహమ్మద్ రఫీ డిమాండ్ చేశారు.
- ప్రధానోపాధ్యాయుడిపై విద్యార్థి తండ్రి దాడికి పాల్పడటం సరికాదని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ఏపీటీఎఫ్ నాయకులు రామచంద్రారెడ్డి, శివయ్య, ఎస్టీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నాగరాజు, రామకృష్ణ, ఎస్సీ,ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు సుబ్బన్న, నాయకుడు లక్ష్మణ్‌నాయక్ వేర్వేరు ప్రకటనల్లో స్పందించారు

## పెరుగుదల లేని మొక్కజొన్న పంట



బ్రాహ్మణపల్లెలో పంటను దున్నేస్తున్న రైతు

చాగలమర్రి: ఎన్నో ఆశలతో సాగు చేసిన మొక్కజొన్న పంట పెరగకపోవడంతో రైతులు తొలగించాల్సి వచ్చింది. బ్రాహ్మణపల్లె గ్రామానికి చెందిన కొందరు రైతులు నెలక్రితం వైఎస్సార్ జిల్లా మైదుకూరులో ఓ ప్రైవేటు కంపెనీకి చెందిన మొక్కజొన్న విత్తనాలను తీసుకొచ్చి 30 ఎకరాల్లో సాగు చేశారు. అయితే, మొక్క పెరగకపోవడంతో దిక్కుతోచక సోమవారం కొందరు దున్నేశారు. సదరు విత్తనాల కంపెనీ నుంచి పరిహారం అందేలా చూడాలని బాధిత రైతులు అధికారులను కోరుతున్నారు.

## పులుల సంరక్షణ అందరి బాధ్యత



పులుల సంరక్షణ, ప్రాముఖ్యతపై ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ఆళ్లగడ్డ: నల్లమలలో పులల సంరక్షణ అందరి బాధ్యత అని రుద్రవరం రేంజ్ అధికారి శ్రీపతి నాయుడు అన్నారు. అంతర్జాతీయ పులుల దినోత్సవాన్ని పురసరించుకుని సోమవారం అహోబిలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పులుల సంరక్షణ, ప్రాముఖ్యతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం స్థానిక పాఠశాల ఆవరణ నుంచి ప్రధాన రహదారి గుండా దిగువ అహోబిలం దేవాలయం వరకు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీవ వైవిధ్యానికి ప్రధాన ఆధారంగా నిలుస్తున్న పులులను సంరక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో డీఆర్వో ముర్తుజావలి, సెక్షన్ ఆఫీసర్లు శ్రీనివాసరెడ్డి, మక్తార్ బాషా, శ్రీనివాసులు ఉన్నారు

### విన్నపాలు

**పీఎంజేవీకే భవనాల నిర్మాణం త్వరగా పూర్తి చేయాలి**

నంద్యాల(వ్యవసాయం): ప్రధానమంత్రి జన్ వికాస్ కార్యక్రమం (పీఎంజేవీకే)కింద ముస్లింలు అత్యధికంగా నివసించే ప్రాంతాల్లో భవన సముదాయాల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలని ఆల్ మేవా సభ్యులు సైపుల్లా, అంజాద్‌బాషా కోరారు. సోమవారం వారు మైనార్టీ న్యాయశాఖ మంత్రి ఎన్‌ఎండీ ఫరూక్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.పీఎంజేవీకే కింద నంద్యాలలో ఆరు భవన సముదాయాలు నిర్మాణానికి నాలుగేళ్ల క్రితం నిధులు మంజూరయ్యాయని గుర్తు చేశారు. కార్యక్రమంలో సభ్యులు అబులైజ్, అజుమ్ముద్దీన్, మునీర్‌అహమ్మద్, తదితరులు పాల్గొన్నారు.

- నంద్యాల(న్యూటౌన్): పట్టణంలో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయని, మహిళలను, వృద్ధులను కాటేస్తున్నాయని, వెంటనే వాటి నియంత్రణకు చర్యలు తీసుకోవాలని సీపీఐ, ఏఐఎస్ఎఫ్,ఏఐవైఎఫ్ నాయకులు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్ రాజకుమారిని కలిసి విన్నవించారు.

## జంప్‌రోప్ పోటీల నిర్వహణ అభినందనీయం



క్రీడాకారులతో మంత్రి ఫరూక్

నంద్యాల(న్యూటౌన్): జిల్లా కేంద్రం నంద్యాలలో రాష్ట్రస్థాయి జంప్ రోప్ పోటీలు నిర్వహించడం అభినందనీయమని రాష్ట్ర న్యాయ, మైనార్టీ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. పట్టణంలోని ప్రథమనంది ఆలయ ఆవరణలో జరుగుతున్న రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ జంప్ రోప్ పోటీలు సోమవారం ముగిశాయి. చివరి రోజు జరిగిన బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమానికి మంత్రి హాజరై మాట్లాడారు. జంప్‌రోప్ పోటీలకు ప్రభుత్వం నుంచి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తానని పేర్కొన్నారు. అనంతరం క్రీడా భారతి రాయలసీమ జోనల్ అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, ఏపీఎస్‌ఏ పీఈ రాష్ట్ర అధ్యక్షుడు, శాంతినికేతన్ చైర్మన్ సుధాకర్ మాట్లాడుతూ క్రీడల అభివృద్ధికి క్రీడా భారతి సంస్థ అన్ని విధాలుగా కృషి చేస్తుందన్నారు. పిల్లలు ఆడటానికి ముందుకు రావాలన్నారు. రాష్ట్ర స్థాయి జంప్‌రోప్ పోటీలకు రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చిన 600 మంది క్రీడాకారులకు మాజీ ఎంపీ ఎస్పీవైరెడ్డి కుటుంబం భోజన వసతి కల్పించడం అభినందనీయమన్నారు.

**ఓవరాల్ చాంపియన్ ఉమ్మడి చిత్తూరు జిల్లా**

జంప్ రోప్ పోటీల్లో ఓవరాల్ చాంపియన్‌గా ఉమ్మడి చిత్తూరు జిల్లా జట్టు నిలించింది. రెండో స్థానంలో కడప జిల్లా, మూడో స్థానంలో కర్నూలు జిల్లాల జట్లు నిలిచినట్లు ఆ క్రీడ నంద్యాల జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రమేష్, పక్కీరయ్య తెలిపారు. గెలుపొందిన విజేతలకు మంత్రి ఫరూక్ చేతుల మీదుగా మెమొంటోలు, ట్రోఫీలు అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర జంప్‌రోప్ చైర్మన్ రాజా, క్రీడా భారతి ప్రధాన కార్యదర్శి సుధాకర్, డాక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డి, డాక్టర్ సుబ్బారావు, నిర్వహణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## శ్రీశైల మల్లన్నకు నృత్య నీరాజనం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆలయ దక్షిణమాడవీధిలోని నిత్యకళావేదికపై రాజమండ్రికి చెందిన లలిత ఐశ్వర్యాంబిక నృత్యక్షేత్ర వా నృత్యప్రదర్శన అలరించింది. గణేశ పంచరత్న కీర్తన, శివతాండవం, శివతరంగం, కామాక్షిస్తుతి, శివశంకరా, శివాష్టకం, జతిస్వరం, అయిగిరినందిని, శివశివశంకరా తదితర గీతాలకు ముత్యాల సునంద, అవంతిక, ధన్విత, లలితాసాత్విక, సత్యగీతిక, వెంకటరమ్య, యశస్వినీ సత్యపూర్ణిమ, లహరి వెంకటసాయి మృదుల తదితరులు నృత్యాలను ప్రదర్శించారు.

### ప్రకృతిని పరిరక్షించుకుందాం

నంద్యాల(న్యూటౌన్): భావితరాల మనుగడ కోసం ప్రకృతిని కాపాడుకుందామని రామకృష్ణ డిగ్రీ కళాశాల చైర్మన్ రామకృష్ణారెడ్డి అన్నారు. నంద్యాల పట్టణంలోని ఆ డిగ్రీ కళాశాలలో సోమవారం ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రకృతిని రక్షించుకోవడం వల్ల స్వచ్ఛమైన వాతావరణం పొందవచ్చునన్నారు.

అవసరాల కోసం పరిసరాలను కాలుష్యం చేస్తున్నామన్నారు. ఇక నుంచి ప్రతి విద్యార్థి పరిసరాలను, వాతావరణాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

### విషజ్వరంతో యువతి మృతి

రుద్రవరం: మండల కేంద్రం రుద్రవరం బలిజ కాలనీకి చెందిన మానస (16)అనే బాలిక విషజ్వరంతో సోమవారం మృతి చెందింది. కాలనీ వాసులు తెలిపిన వివరాల మేరకు.. గత కొద్ది రోజులుగా ఈ బాలిక జ్వరంతో బాధపడేది. కుటుంబసభ్యులు స్థానికంగా ఉన్న ఓ వైద్యశాలలో చికిత్స చేయించారు. అయినా జ్వరం తగ్గకపోవడంతో మెరుగైన వైద్యం కోసం 108లో నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లారు. అక్కడ కోలుకోలేక సోమవారం మృతి చెందింది. ఈ విషయాన్ని రుద్రవరం పీహెచ్‌సీ వైద్యాధికారి శివమోహన్ దృష్టికి తీసుకెళ్లగా జ్వరాలు సోకగానే ఆలస్యం చేయకుండా ప్రభుత్వ వైద్యశాలకు వచ్చి వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.

### సమస్యల పరిష్కారంలో జాప్యం తగదు

ఉయ్యాలవాడ : ప్రజా సమస్యల పరిష్కారంలో జాప్యం తగదని వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ రఘురాం, డిప్యూటీ తహశీల్దార్ తులసి క్రిష్ణ ఆదేశించారు. సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు హాజరైన అధికారులతో వారు మాట్లాడారు. ఆగస్టు 1వ తేది ఎన్‌టీఆర్ భరోసా పింఛన్లు ఉదయం 6 గంటల నుంచే ప్రారంభించాలన్నారు.

### సామాజిక తనిఖీలకు సహకరించాలి

నంద్యాల(అర్బన్): ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పనులపై నిర్వహించే సామాజిక తనిఖీలకు కూలీలు సహకరించాలని ఎంపీడీఓ సౌభాగ్యం సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ఆగస్టు 1న రాయమాల్పురం, బిల్లలాపురం, భీమవరం గ్రామాలు, 2వ తేదీన పుసులూరు, చాబోలు, మునగాల, కానాల, అయ్యలూరు, కొత్తపల్లె, పోలూరు, చాపిరేవుల, పెద్దకొట్టాల, 3న పాండురంగాపురం, బ్రాహ్మణపల్లె, గుంతనాల, 4న బ్రాహ్మణపల్లె, మునగాల, 5న పాండురంగాపురం, పుసులూరు, పోలూరు, గుంతనాల, పెద్దకొట్టాల గ్రామాల్లో అధికారులు పర్యటించనున్నారన్నారు. ఇందు కోసం 2వ తేదీన పులిమద్ది, రాయమాల్పురం, భీమవరం గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించనున్నారన్నారు. వీటితో పాటు 3వ తేదీన మిట్నాల, చాబోలు, కానాల, అయ్యలూరు, కొత్తపల్లె, చాపిరేవుల, 5న బ్రాహ్మణపల్లె, మునగాల, 6న పుసులూరు, పోలూరు, గుంతనాల, పెద్దకొట్టాల గ్రామాల్లో గ్రామ సభలు ఉంటాయన్నారు. ఆగస్టు 8న ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో సోషల్ ఆడిట్ జరగనుందన్నారు.

- ప్రభుత్వ పాఠశాలల్లో ముగిసిన శిక్ష సప్తాహ్ కార్యక్రమం
- చివరి రోజు సహపంక్తి భోజనాలు

# కలిసిమెలసి..భోజనం చేసి



దొర్నిపాడు మండలం అర్జునాపురంలో సహపంక్తి భోజనం చేస్తున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, టీచర్లు



గోస్పాడులో విద్యార్థులతో కలిసి తిథి భోజనం చేస్తున్న అధికారులు

గోస్పాడు: జాతీయ విద్యా విధానం (ఎన్‌ఈపీ) ప్రారంభమై నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా శిక్ష సప్తాహ్ పేరుతో ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన వారోత్సవాలు ముగిశాయి. ఈ కార్యక్రమంలో భాగంగా ఈనెల 22 నుంచి 29వ తేదీ వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. చివరి రోజు సోమవారం సామాజిక భాగస్వామ్య దినోత్సవం నిర్వహించారు. నంద్యాల, ఆళ్లగడ్డ నియోజకవర్గాల్లోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో ఈ కార్యక్రమం జరిగింది. ప్రజలు, తల్లిదండ్రుల కమిటీలు, ఉపాధ్యాయ సంఘాలు, దాతల సహకారంతో సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేశారు. విద్యార్థులతో కలిసి దాతలు, విద్యాధికారులు, ఉపాధ్యాయులు తిథి భోజనం చేశారు.

- గోస్పాడు మండలంలోని ఎం.కృష్ణాపురం, ఎంపీయూపీ పాఠశాలల్లో జరిగిన కార్యక్రమంలో ఏఎంఓలు యూనిస్‌బాషా, లలిత పాల్గొని మాట్లాడారు. పాఠశాలలో విద్యార్థులకు మెరుగైన విద్యతో పాటు మధ్యాహ్న భోజన పథకం ద్వారా నాణ్యమైన ఆహార పదార్థాలు అందించాలన్నారు. కార్యక్రమంలో దాత హుసేన్, ఎంఈఓ అబ్దుల్‌కరీం, హెచ్‌ఎం శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు. సాంబవరం ఎలిమెంటరీ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ బజయ్య, ఎంపీటీసీ భారతి, బోరెడ్డి శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.
- చాగలమర్రి: స్థానిక పాత బస్టాండు వద్ద ఉన్న ప్రాథమిక పాఠశాల, మద్దూరు, గోడిగనూరు గ్రామాల్లోని ఎంపీపీ పాఠశాలల్లో దాతల సహకారంతో సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓలు అనురాధ, న్యామతుల్లా తదితరులు పాల్గొన్నారు.
- రుద్రవరం: మండల కేంద్రం రుద్రవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం ఉపాధ్యాయులు విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. నూతన జాతీయ విద్యా విధానం(2020) అమల్లోకి వచ్చి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా విద్యావారోత్సవాలు నిర్వహించినట్లు హెచ్‌ఎం సుబ్బరాయుడు తెలిపారు.
- ఉయ్యాలవాడ : శిక్ష సప్తాహ్‌లో భాగంగా చివరి రోజు నిర్వహించిన తిథి కార్యక్రమంలో దాతలు అందజేసిన స్వీట్లు, పండ్లను విద్యార్థులకు మధ్యాహ్నం భోజనంలో పంపిణీ చేశారు. ఎంఈఓ వీరప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తున్నట్లు చెప్పారు.
- శిరివెళ్ల: మండలంలోని పలు పాఠశాలల్లో దాతల సహకారంతో విద్యార్థులకు రుచికర భోజనాలు వడ్డించారు. ఈ కార్యక్రమాన్ని ఏంఈఓలు శంకరప్రసాదు, నాగార్జునరెడ్డి పర్యవేక్షించారు.
- దొర్నిపాడు: మండలంలో గత వారం రోజులుగా నిర్వహిస్తున్న శిక్ష సప్తాహ్ సోమవారంతో ముగిసినట్లు ఎంఈఓ రామచంద్రయ్య తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం సామాజిక భావోద్వేగ శ్రేయస్సు కోసం స్థానికులు, తల్లిదండ్రుల కమిటీలు, ఉపాధ్యాయ సంఘాల సహకారంతో సహపంక్తి భోజనం నిర్వహించామన్నారు.